క్లుప్తంగా

ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం పునః ప్రారంభం సందర్భంగా గురువారం తొలి రోజు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది విద్యా సంవత్సరం నేటి నుంచి ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ కచ్చితంగా పాఠశాలలకు హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడానికి అర్హులైన ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, మూర్తి, లక్ష్మి, రాఘవకుమారి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి



మండపేటలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తొలిసారిగా మండపేటలోని తన క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీఓ కొండలరావు, 19 పంచాయతీల కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

అవగాహనతో మలేరియా అంతం



వడ్లమూరులో ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: అవగాహనే ఆయుధంగా మలేరియా వ్యాధిని దూరం చేయ గలమని అచ్యుతాపురం ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని అచ్యుతాపురం పీహెచ్సీ అధికారి కరుణేంద్రకుమారి ఆదేశాలపై మండలంలోని వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో గురువారం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఆయా గ్రామాల వీధుల్లో మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసిత ప్రాంతాల్లో దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియా వ్యాప్తిని నిలువరించవచ్చన్నారు.

ఎంపీడీఓగా జీవీ సరోవర్



అంబాజీపేట: కొత్త మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవీ సరోవర్ గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అల్లవరం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ అంబాజీపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్చార్జి ఎంపీడీఓగా ఇప్పటివరకు కె.వరలక్ష్మి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును ఎంపీడీఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సరోవర్కు ఈఓపీఆర్డీ బి.మమత, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

ఫిషింగ్ హార్బర్ను పరిశీలించిన జేడీ



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాస్

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ను గురువారం ఫిషరీస్ జేడీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ నెల 15వ తేదీ నుంచి సముద్రంపై వేట ప్రారంభం కానున్న నేపథ్యంలో హార్బర్లో మత్స్యకారుల సౌకర్యాలను పరిశీలించారు. హార్బర్ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఆయనతో ఏడీ హర్షవర్ధన్ ఉన్నారు.

వానాకాలం... వనాల అంకురం

- మొక్కలు నాటేందుకు అనువైన సీజన్
- దోహదపడిన జగనన్న పచ్చతోరణం పథకం
- చెరువు గట్లను పటిష్ట పరుస్తున్న కేంద్ర ప్రభుత్వం



వెదురుమూడి-కాలేరు రహదారిలో గుబురుగా ఉన్న చెట్లు



పడమర ఖండ్రికలో రహదారి వెంబడి ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు

కపిలేశ్వరపురం: వృక్షో రక్షితిః రక్షితః అనే మాట బహుళ ప్రాచుర్యంలో ఉంది. వృక్షాల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో విశేష కృషి చేశాయి. ప్రత్యేక పథకాలతో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో మొక్కలు నాటేందుకు ప్రస్తుతం అనుకూలం. పర్యావరణ పరిరక్షణ, వర్షాకాలం ప్రాధాన్యత నేపథ్యంలో ఈ కథనం...

పర్యావరణానికి విఘాతమిలా...

పర్యావరణానికి అనేక కారకాలు విఘాతం కలిగిస్తున్నాయి. ఆధునికత పేరుతో వినియోగంలోకి వచ్చిన సరకులు పెద్ద స్థాయిలో వ్యర్థాల ఉత్పత్తికి దారి తీస్తోంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గాలు మూసుకు పోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వాటన్నింటి ప్రభావాన్ని సాధ్యమైనంత తగ్గించేందుకు మొక్కల పెంపకం ఉపకరిస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలిలా...

వృక్ష సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా చేపడుతున్నాయి. ఐదేళ్లలో జగనన్న పచ్చతోరణం పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టింది. అమృత సరోవర్ ట్యాంక్ పేరుతో చెరువు గట్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందు కోసం నిధులను కేటాయించి మొక్కలను సరఫరా చేస్తున్నాయి. అమృత సరోవర్ కింద 2023లో జిల్లాలో 75 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. వాటిలో మండలానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే చెరువు గట్లను పటిష్టపరచి కొబ్బరి మొక్కలు నాటారు. సందర్శకులు కూర్చునేలా సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు.

రెండు నియోజకవర్గాల్లో మొక్కల పెంపకం ఇలా..

కపిలేశ్వరపురం మండలంలో 2021లో 2.40 కిలోమీటర్ల పొడవునా నాలుగు ప్రదేశాల్లో 961 మొక్కలు నాటారు. 2022లో నిడసనమెట్టలో 200 మొక్కలు నాటారు. నేలటూరులోని అమృత సరోవర్ కింద చెరువు గట్లపై 50 కొబ్బరి మొక్కలు నాటారు. రాయవరం మండలంలో 2021లో 9.26 కిలోమీటర్ల విస్తీర్ణంలోని 12 ప్రదేశాల్లో 3,705 మొక్కలు నాటారు. 2022లో కురకాళ్లపల్లి, వెంటూరు, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో 1,140 కొబ్బరి మొక్కలు నాటారు. అమృత సరోవర్ చెరువుగా వెంటురు చిన్న చెరువును ఎంపిక చేసి 150 కొబ్బరి మొక్కలు గట్టు చుట్టూ నాటారు. రామచంద్రపురం మండలంలో 2021లో 18.23 కిలోమీటర్ల మేర 27 ప్రదేశాల్లో 7,290 మొక్కలు నాటారు. అమృత సరోవర్ చెరువు పేరుతో మాలపాడు చెరువు గట్టుపై 100 కొబ్బరి మొక్కలు నాటారు. కె.గంగవరం మండలంలో 8.25 కిలోమీటర్ల మేర 20 ప్రదేశాల్లో 3,300 మొక్కలు నాటారు. దంగేరులో 100, యండగండిలో 160 మొక్కలు నాటారు. కాజులూరు మండలంలో 4.15 కిలోమీటర్ల మేర 8 ప్రదేశాల్లో 1,660 మొక్కలు నాటారు. మండపేట మండలంలో 2021లో 11.50 కిలోమీటర్ల మేర 12 ప్రదేశాల్లో 4,600 మొక్కలు నాటారు.

వృక్షాలపై ఆధ్యాత్మిక అంశాలెన్నో

వృక్ష సంపద ప్రాధాన్యతను తెలియ జెప్పే ఆధ్యాత్మిక అంశాలెన్నో ఉన్నాయి. నక్షత్రం, గ్రహాలు, ఋషులకు ఒక్కో మొక్క నిర్ధారించినట్టు ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బుధ గ్రహానికి ఉత్తరేణి, శుక్ర గ్రహానికి మేణి, చంద్రకు మోదుగ, గురువుకు రావి, రవికి జిల్లేడు, కుజకు చండ్ర, కేతుకు దర్భ, శనికి జమ్మి, రాహువుకు గరిక వృక్షాలను పూజిస్తారు. కశ్యప ఋషికి ప్రతిగా తులసి, అత్రి ఋషికి అవిశ, భరద్వాజకు ఉత్తరేణి, విశ్వామిత్రకు మారేడు, గౌతమికి తెల్ల ఉమ్మెత్త, జమదగ్ని గరిక, వశిష్ట ఋషికి జమ్మి వృక్షాన్ని పూజిస్తారు. ఇలా ఒక్కో నక్షత్రానికి ఒక్కో వృక్షాన్ని పూజిస్తారు.

రెండు నియోజకవర్గాల్లో వ్యర్థాల ఉత్పత్తి ఇలా...

మండలం	కుటుంబాల సంఖ్య	వ్యర్థాల ఉత్పత్తి (టన్నుల్లో)
కపిలేశ్వరం	23,349	5,600
రాయవరం	23,867	5,900
మండపేట	42,515	10,200
ఆర్పీపురం	41,003	9,300
కె.గంగవరం	22,842	4,400
మొత్తం	1,53,576	35,400

ఒక్క మొక్కనైనా నాటుదాం



వృక్షో రక్షితిః రక్షితః అని పెద్దలు చెప్పిన దాన్ని అందరూ పాటించాలి. జీవకోటికి ప్రాణవాయువును అందించే వృక్షాలను కాపాడు కోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. మొక్కలను నాటడం, పెంచడం సామాజిక బాధ్యతగా భావించాలి. మానవ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకోసం వనాల వృద్ధి అవసరం.

-పిల్లా వీరబాబు, సామాజిక కార్యకర్త, పాలతోడు, మండపేట మండలం.

క్యాన్సర్ వ్యాధిపై వైద్యులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్, ఇతర వైద్యులు

రామచంద్రపురం: క్యాన్సర్ వ్యాధిపై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్లోని ప్రభుత్వాస్పత్రుల వైద్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయా డివిజన్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, ఎంఎల్హెచ్పీ/సీహెచ్ఓ, ఏఎన్ఎంలకు క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం, చికిత్స, నివారణ చర్యలపై ఈ శిక్షణను ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ ప్రారంభించారు. జూలై 13 వరకు 8 బ్యాచ్లకు, బ్యాచ్కు మూడు రోజుల వంతున శిక్షణ ఇస్తారని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. క్యాన్సర్కు అధునాతన చికిత్స విధానాలైన కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ వంటివి ఉన్నాయని చెప్పారు. క్యాన్సర్పై ఆందోళన అవసరం లేదని, క్యాన్సర్ వ్యాధిని త్వరగా గుర్తిస్తే చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ పొగాకు, మద్యం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకునే వారిలో ఊబకాయం, ఎక్కువ వయసు సంబంధిత వారికి, వ్యక్తిగత పరిశుభ్రత లేని వారు క్యాన్సర్కు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకుని, గ్రామాల్లో వ్యాధి సంబంధ లక్షణాలు త్వరగా గుర్తించి, చికిత్స చేయడం ద్వారా వ్యాధి తీవ్రత తగ్గించవచ్చని తెలిపారు. వైద్యులు బి.సౌమ్య, బి.శ్రీధర్, వాణి తదితరులు శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు హేమంత్ చక్రధర్, కల్యాణ బాబు, డివిజనల్ సూపర్వైజర్ జి.కమలేశ్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మేఘన తదితరులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను వినియోగించుకోండి

- రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు
- మండపేట సబ్ పోస్టాఫీసు సందర్శన



పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావును సత్కరిస్తున్న పోస్టల్ సిబ్బంది

మండపేట: పోస్టల్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోస్టల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. శేషారావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండపేట సబ్ పోస్టాఫీసును గురువారం ఆయన తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం తపాలా శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను, బీమా స్కీములను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేలా కృషి చేయాలని ఉద్యోగులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ఉద్యోగుల కృషికి శేషారావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్, సేవింగ్స్ బ్యాంక్, పోస్ట్ పేమెంట్ బ్యాంక్తో పాటు ప్రమాద, వాహనాల బీమా పథకాలను వినియోగించు కోవాలన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇప్పటి వరకూ ఉద్యోగులకు మాత్రమే ఉండేదని, దీనిని గ్రాడ్యుయేషన్ చేసిన ప్రతి ఒక్కరికీ అమలు చేస్తున్నారన్నారు. దీనివల్ల ట్రిబుల్ బెనిఫిట్ పొందవచ్చన్నారు. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్తో పాటు ఉద్యోగస్తులకు ఐటీ రిటర్న్స్ బెనిఫిట్ కూడా ఉందన్నారు. అంతేగాకుండా చివరిలో హై రిటర్న్స్ కూడా ఉంటాయని వివరించారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు పోస్టల్ శాఖ ద్వారా కేవలం రూ.14 ఖర్చుతో శుభాకాంక్షలు తెలపవచ్చన్నారు. ఆధునిక టెక్నాలజీతో ప్రజలకు తపాలా సేవలను అందిస్తున్నామని, ఉత్తరాల బట్వాడా కూడా నాణ్యంగా, వేగంగా అందిస్తున్నామన్నారు. కాగా తొలిసారిగా మండపేట విచ్చేసిన శేషారావును పోస్ట్మాస్టర్ ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దశ్శాలువాతో ఘనంగా సత్కరించి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణ, కొండపల్లి సూర్యనారాయణ, ఎండీఎం షరీఫ్, శివయ్య, కె.ఈశ్వరరావు, ఎం. అనూష తదితరులు వున్నారు.

16న మంత్రి సుభాష్ రాక

కాజులూరు: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్ ఆదివారం(ఈ నెల 16న) తొలిసారి నియోజకవర్గానికి రానున్నారు. గురువారం టీడీపీ నాయకులు చందాల బాబి, అంగర కృష్ణ, గుబ్బల ఏసురాజు తదితరులు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు రావులపాలెం చేరుకోనున్న మంత్రి సుభాష్, అక్కడి నుంచి జొన్నాడ, మండపేట, పసలపూడి, రామచంద్రపురం మీదుగా ద్రాక్షారామలోని బోసు బొమ్మ సెంటర్కు చేరుకుంటారని వివరించారు. జొన్నాడలో కూటమి నాయకులు ఆయనకు స్వాగతం పలికి, ర్యాలీగా తరలివస్తారని చెప్పారు.

ఏటిగట్టు రహదారిని అభివృద్ధి చేయాలి

కె.గంగవరం: యానాం-జొన్నాడ ఏటిగట్టు రహదారి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్కు దళిత నాయకులు రవ్వా భూషణం విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఉన్న మంత్రి సుభాష్ను గురువారం భూషణం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఏటిగట్టు రహదారిని ఆధునీకరించడం వల్ల రెండు హైవేలకు అనుసంధానంగా ఈ ఏటిగట్టు రోడ్డే ప్రధాన రహదారి అవుతుందని వివరించారు. తద్వారా జొన్నాడ నుంచి యానాం వరకూ ఏటిగట్టు ఒడ్డున ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ రహదారి అభివృద్ధికి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని భూషణం చెప్పారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



రాయవరం పాఠశాలలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో సూర్యనారాయణ, స్థానిక నేతలు

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు పేర్కొన్నారు. స్థానిక రాజేశ్వరి కాలనీలోని మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాల్లో గురువారం స్టూడెంట్ కిట్లలో భాగంగా పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టారు. పాఠశాల హెచ్ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో వై.సూర్యనారాయణ, స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, దేవిశెట్టి చిన్న, వి.గోపికృష్ణ, బి.దుర్గాప్రసాద్, సీహెచ్ సత్యనారాయణ, షేక్ అమీర్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి, ఉపాధ్యాయులు అందుకనుగుణంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సత్యనారాయణమ్మ, ఆర్.భాస్కరరావు, ఎస్.వెంకటరమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖరీఫ్కు సబ్సిడీపై వరి విత్తనాలు

మామిడికుదురు: మండల పరిధిలోని రైతులు 3,500 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంట సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఖరీఫ్ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. మామిడికుదురు, నగరం, లూటుకుర్రు, కొమరాడ, ఆదుర్రు, పాశర్లపూడి, ఈదరాడ, గెద్దాడ, మొగలికుదురు, పెదపట్నం గ్రామాల్లో రైతులకు ఈ సబ్సిడీ వరి విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఎంటీయూ-1064 రకం వరి విత్తనాలు 24 క్వింటాళ్లు, ఎంటీయూ-1318 రకం వరి విత్తనాలు 96 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి బి.మృదుల గురువారం తెలిపారు. కిలోకు రూ.5 సబ్సిడీపై విత్తనాలు రైతులకు అందజేస్తున్నామన్నారు. 30 కిలోల విత్తనాల బస్తా రూ.1,194 కాగా, దాన్ని సబ్సిడీ పోను రూ.1,044కు విక్రయిస్తున్నామని చెప్పారు. ఎంటీయూ-1318, ఎంటీయూ-1064 రెండు రకాలు ఇదే ధరకు విక్రయిస్తున్నామని ఏఓ తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్మన్ మృతి

ఆత్రేయపురం: విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై మండలంలోని నార్కెడ్మిల్లి గ్రామానికి చెందిన లైన్మన్ సుంకర ఈశ్వరరెడ్డి (36) మృతి చెందినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. రంపచోడవరానికి చెందిన సుంకర ఈశ్వర్రెడ్డి రెండేళ్లుగా నార్కెడ్మిల్లిలో లైన్మన్గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల 16న నార్కెడ్మిల్లిలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. రావులపాలెం ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

స్కూళ్లలో పాఠ్య పుస్తకాల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలో నూరు శాతం పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందజేసినట్టు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 86 ప్రభుత్వ పాఠశాలల్లో 6,601 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పట్టణంలోని స్టాకు పాయింట్ నుంచి చేరవేశామన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. ఏడో తరగతికి సంబంధించి కొన్ని టైటిల్స్ రావాల్సి ఉందన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీలు పూర్తి స్థాయిలో వచ్చాయన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

అంబాజీపేట: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలన్నారు. తమ స్థాయిలో పరిష్కారం కాని అంశాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ నిర్వహణాధికారి కె.వరలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.మమత, డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, ఎం.వెంకటరమణ, వి.లక్ష్మీపతి, ఆర్వై చంటి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆహార సుస్థిర అభివృద్ధిపై అవగాహన

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక గ్రామంలో గురువారం ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి విద్యార్థులకు, గ్రామస్తులకు ఆహార సుస్థిర అభివృద్ధి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుతేన్న ఏడు రోజుల షెడ్యూల్లో భాగంగా రెండో రోజు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ ప్రకృతిలో మమేకమయ్యే రీతిలో గ్రామంలోని కొన్ని పొలాల్లో వారితో కలిపి ఆమె పర్యటించారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి, ఆహార సుస్థిర అభివృద్ధికి తోడ్పాటునిచ్చే అంశాలపై కూడా ఆమె అవగాహన కల్పించారు. దీంతో మొక్కలు నాటడంలోను, చేతి వృత్తులను పరిశీలించడంలోను, భూ ఆవరణ చరిత్రను తెలుసుకోవడంలోను, ఆచార సంప్రదాయాలను పరిశీలించడంలోను విద్యార్థులు మమేక మయ్యారు. గ్రామ పెద్దలు రేపూరి ఏసు నరసింహ రాజా, నడింపల్లి వెంకట సుబ్బరాజు, చల్లా నాగరాజు, విద్యావేత్తలు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

అక్కరకు రాని అపరాల సాగు

- పొలాల్లోకి చేరుతున్న నీరు
- చనిపోతున్న మొక్కలు
- ఆందోళన చెందుతున్న రైతులు



చేదువాడలో మినుము సాగు చేసిన పొలంలో చేరిన నీరు

కాజులూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన అపరాల పంట రైతులకు నష్టాలను మిగుల్చుతోంది. పంట పూత, పిందె దశలో ఉండగా చెదురుమదురు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు కాలువల నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాల్లో నీరు నిలిచి, ఊట పెరిగి మొక్కలు చనిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కప్పుడు రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మూడో పంటగా రైతులు పెసర, మినుము వంటి అపరాలను విస్తారంగా పండించేవారు. కాలక్రమేణా సాగుబడిలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అపరాల సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వచ్చింది. ఆశ చావక కొందరు రైతులు అపరాలు సాగు చేసినప్పటికీ, పూత, పిందే సమయానికి వర్షాలు, కాలువ నీరు వచ్చి మొక్కలు కుళ్లిపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వరి సాగు ఆలస్యమే అవరోధం

డెల్టా ప్రాంతంలో కొన్నాళ్లుగా ఖరీఫ్, రబీ సాగులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో జూన్, జూలైల్లో తొలకరి సాగు, నవంబర్, డిసెంబర్లో దాళ్వా సాగు ప్రారంభమయ్యేది. మార్చి నెలాఖరుకు రెండో పంట పూర్తి స్థాయిలో చేతికొచ్చేది. ఆ సమయంలోనే అపరాలకు అసలైన పదను కుదురుతుంది. గత కొంతకాలంగా సకాలంలో వర్షాలు కురవకపోవటం, కాలువల నీరు సరిగా అందకపోవటంతో పంట కాలం ఆలస్యమవుతూ వస్తోంది. ఈ ఏడాది మే నెల వచ్చినా, దాళ్వా మాసూళ్లు పూర్తి కాలేదు. దీంతో అపరాలను సాగు చేసేందుకు వీల్లేకుండా పోయింది. గతంలో అపరాల ఆదాయాన్ని వదులుకోలేని కొందరు రైతులు, ఆలస్యమైనా అపరాలను సాగు చేయడానికి సిద్ధమయ్యారు.

పొడి నేల అవసరం

ప్రస్తుతం వర్షాలు వచ్చే సమయానికి పంట పూత, పిందే దశకు చేరుకుంది. ఆరుతడి పంట అయిన అపరాల సాగుకు పొడినేల అవసరం. పొలంలో నీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతే మొక్క చనిపోతుంది.

మార్చి, ఏప్రిల్ నెలల్లో అపరాల సాగు చేపట్టి ఉంటే ఈపాటికి పంట కోత దశకు వచ్చేదంటున్నారు. దాళ్వా మాసూళ్ల ఆలస్యంతో అపరాలు ఆలస్యంగా చల్లటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. కష్టపడి పండించిన పంట కాపు కాసే సమయానికి బుగ్గి పాలవుతుందని, దీంతో మొక్కలను పొలంలో కలియ దున్న వలసి వస్తుందని రైతులు చెబుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



బయట మార్కెట్లో అపరాల ధర ఆకాశానంటుతోంది. కనీసం ఇంటి అవసరాలకైనా నాలుగు గింజలు పండిద్దామని ఆశ చావక పెసర, మినుము సాగు చేస్తుంటే, పూత, పిందె సమయం వరకూ పెరిగి, చేతికందకుండా పోతున్నాయి. రైతులు వరి సాగు సకాలంలో పూర్తి చేసి, అపరాల సాగుకు అవకాశం కల్పించుకోవాలి.

- ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు, మొగలిపాలెం

సకాలంలో సాగు చేపట్టాలి



రైతుల్లో వ్యవసాయాధికారులు చైతన్యం తీసుకురావాలి. వరి సాగు కాలమానంలో జరుగుతున్న ఆలస్యం కారణంగానే అపరాల పంటకు అవరోధాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ కలిపించుకుని వరి సాగు సకాలంలో చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలి.

- కేశన వీర్రాజు(బాబు), రైతు, అంద్రంగి

కల్యాణోత్సవాలను విజయవంతం చేయండి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. తన నివాసంలో స్వామి వారి కల్యాణోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. ఉద్యోగులు సమన్వయంతో పని చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గ్రంథి మాధవి, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.